తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఘనంగా మొహర్రం పండగ.. పీర్ల ఊరేగింపు

పెద్దపంజాణి, జూలై 17 ప్రభాతవార్త



మండలంలో మొహర్రం పండగను హిందు ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఇమామ్ ఎ హుసేన్ విశ్వశాంతి కోసం తమ ప్రాణాలు అర్పించిన సంఘటనను తలచుకుని ఏటా మొహర్రం పండగను జరుపుకోవడం ఆనవాయితీ. పండగ సందర్భంగా ఉపవాస దీక్ష చేపట్టారు. అనంతరం పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా ఊరేగించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేశం నేతలు ముబారక్‌తాజ్, షేక్ నజీర్, సర్దార్, బావాజాన్, జమాత్ పెద్దలు, ముతవల్లి బావాజాన్, అజీజ్ అహ్మద్, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

## కొటాల వద్ద చిరుత సంచారం
### భయాందోళనలో ప్రజానీకం

చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త:



మండల పరిధిలోని కొటాల జగనన్న కాలనీ సమీప అడవిలో చిరుతపులి సంచారం ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు చేస్తున్న ప్రజలు అడవి వైపు చూస్తుండగా కొండ పైభాగంలో బండపై చిరుత వెళుతుండటాన్ని వీడియోలో చిత్రీకరించారు. ఈ వీడియోను ఎఫ్ఆర్ఓ మాధవికి పంపడంతో అధికారులు చిరుతపులి కోసం గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా ముందుగా సిసి కెమెరాలు ఏర్పాటుచేసి చిరుత జాడ తెలుసుకునే ప్రయత్నాలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ చిరుత సంచరించిన దాఖలాలు లేవనీ, మొదటిసారిగా చిరుత సంచారాన్ని చూస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

## కుప్పం రెస్కో అవకవతకలపై
# నేడు సమగ్ర విచారణ



.కుప్పం రెస్కో కార్యాలయం వద్ద బందోబస్తు

### ముప్పై అంశాలపై దస్త్రాలు పరిశీలన.. కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు !!

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)లో చోటు చేసుకున్న అవకతవకలపై గురువారం విచారణ అధికారి శ్రీలక్ష్మి సమగ్ర విచారణ చేపట్టనున్నారు. గురువారం ఆమె కుప్పంలోని రెస్కో కార్యాలయానికి చేరుకుని ముప్పై అంశాలపై దస్త్రాలను పరిశీలించి విచారించనున్నారు. అందులో భాగంగా సంస్థ ఆర్థికస్థితిగతులు, రిజిస్ట్రేషన్, 2010నుంచి అప్‌డేట్ చేసిన సంస్థ, సర్వీస్ బైలా, పదేళ్ల నుంచి జరిగిన జనరల్ బాడీ సమావేశాల మినిట్స్ పుస్తకాలు, 2010నుంచి సంస్థలో చేపట్టిన నియామకాలు, సంస్థ బడ్జెట్, వ్యయాలు, 2013నుంచి చెల్లించిన మెడికల్ బిల్లులు, రెస్కో సభ్యులకు సెల్‌ఫోన్ల కోసం ఇచ్చిన పదివేల రూపాయలు, మాజీ ఎండి సుబ్రమణ్యంకు ప్రమోషన్ ఇచ్చిన విధానం, నియమనిబంధనలు, 2013-14నుంచి ప్రస్తుతం వరకు ఉన్న ఆర్థిక లావాదేవీలు, మాజీ ఎండి జయచంద్రారెడ్డికి కల్పించిన ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ల వివరాలపై విచారించనున్నారు.అదేవిధంగా రెస్కో పరిధిలో చేపట్టిన ఔట్ సోర్సింగ్ నియామకాలు, జీతాల చెల్లింపులు, రెస్కో అధికారులు హిమ్మత్‌సాగర్, సిఎం ప్రభాకర్‌లకు ఇచ్చిన ప్రమోషన్లు, రెస్కో పాలకవర్గ ఛైర్మన్, సభ్యులకు ఇచ్చిన వేతనాలు, అలవెన్సులపై విచారిస్తారు. 2019-20లో సంస్థకు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విత్‌డ్రాల వివరాలు, కేంద్ర ప్రభుత్వం యొక్క దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన పథకంలో భాగంగా 2016-20మధ్య చేపట్టిన పనులు, కేంద్రం నుంచి మంజూరైన నిధులు, రెస్కో ఉద్యోగుల టిఎ, డిఎల వివరాలు రెస్కో పరిధిలో చేపట్టిన ఉద్యోగాలకు సంబంధించి ఇచ్చిన అడ్వర్‌టైజ్‌మెంట్లు, నియామకాలకు సంబంధించి అనుమతుల రికార్డులు, గత పాలకవర్గం పరిధిలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులు, వారి హోదావివరాలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు ఆర్.శ్రీనివాసులు, దామోదరంలకు అందించిన గ్రాట్యుటీల వివరాలు, సంస్థకు చెందిన సేవింగ్స్ ఖాతాలు, సంస్థ పరిధిలో చేపట్టిన కొనుగోళ్లు, బిల్లులు ఇచ్చిన తేదీల వివరాలు, ఫర్నీచర్, స్టేషనరీ కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై విచారణ చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజులక్రితమే ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు సైతం విచారించి పలు రికార్డులు పరిశీలనకు తమ వెంట తీసుకెళ్లిన విషయం విదితమే. కాగా బుధవారం ఉదయం నుంచే రెస్కో కార్యాలయం వద్ద పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు. సెలవు రోజు అయిన నేపథ్యంలో రెస్కో కార్యాలయంలోకి అధికారులను ఎవర్నీ అనుమతించలేదు. కాగా గురువారం సమగ్ర విచారణ జరగనున్న నేపథ్యంలో రెస్కో అధికార యంత్రాంగంలో ఉత్కంఠ నెలకొంది.

### 2047లో మన దేశం
## వికసిత్ భారత్‌గా మారనుంది
### కేంద్ర మంత్రి ఎస్పి సింగ్ బఘేల్



కేంద్ర మంత్రికి షీల్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

తిరుపతి హెల్త్, జులై 17, ప్రభాతవార్త

2047లో మన దేశం వికసిత్ భారత్‌గా ఖచ్చితంగా మారనుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ, పంచాయితీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్పి సింగ్ బఘేల్ పేర్కొన్నారు. బుధవారం తిరుపతిలో కురబ కులస్తుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రిని కురబ కులస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం కేంద్రమంత్రి ఎస్పి సింగ్ బఘేల్ విలేకరులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెబుతున్నట్లుగా భారతదేశం వికసిత్ భారత్ వైపు పయనిస్తోందన్నారు. వేగవంతమైన, అద్భుతమైన, సుపరిపాలనను నరేంద్ర మోడీ దేశప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోందని ప్రజలు విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. నరేంద్రమోడీ పాలనలో దేశ ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కురుబ, కురువ, కురమ నాయకులు జబ్బల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సింగ్ బగేల్, రేవన్న ఎక్స్ మినిస్టర్ కర్ణాటక, ఆర్. కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు, బసవరాజ్ సభ్యులు ఆఫ్ పార్లమెంట్ కర్నాటక, బాయ్ బాబు దేశాయ్, రాజ్యసభ సభ్యులు గుజరాత్, రెడ్డి కుమార్, మంగి రెడ్డప్ప, గుండ్లూరు శ్రీనివాసులు, రుయా మల్లీ, తదితరులు పాల్గొన్నారు.

### ఎనిమిదేళ్ల బాలిక
# దారుణహత్య

నాయుడుపేట, దొరవారిసత్రం జూలై 17 ప్రభాతవార ్త;



తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం నెలబల్లి అటవీ ప్రాంతంలో 8 ఏళ్ల బాలికను దారుణంగా హత్యచేసిన సంఘటన చోటుచేసుకుంది. నెలబల్లి సమీపంలోని ధాన్యలక్ష్మి రైస్‌మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన 40 కుటుంబాలు కూలి పనులు చేస్తున్నారు. వీరిలో వంటమాస్టరుగా పనిచేస్తున్న లలూక్ అనే వ్యక్తికి అనికకుమారి(8) కుమార్తె ఉంది. ఈ రోజు మధ్యాహ్నం వారితో పనిచేసే బీహార్‌కే చెందిన దిలీప్‌కుమార్ (21) ఆ బాలికను తనతో తీసుకువెళుతున్నట్లు కొందరు చూశారు. తర్వాత కొద్దిసేపటికే రైస్‌మిల్ సమీప అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న నాయుడుపేట డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇతర సిబ్బంది దగ్గర్లోని సిసి ఫుటేజీ పరిశీలించడంతో కూలీ పనికి వచ్చిన బీహార్ యువ కుడు దిలీప్(21) ఉదయం 10 గంటల సమయంలో చేయి పట్టుకుని శవమై పడివున్న ప్రాంతం వైపు తీసుకెళ్లినట్లు గుర్తించారు. దిలీప్ ఎవరులేని సమయంలో బాలికకు మాయమాటలుచెప్పి అటవీప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించగా దీంతో బాలిక తిరస్కరించి పెద్దగా కేకలు వేయడంతో మద్యం మత్తులో ఉన్న దిలీప్ హత్యచేసి అక్కడ నుండి పరారైనట్లు తెలిసింది. నాయుడుపేట డిఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎస్.ఐ తిరుమలరావులు బాలిక మృతి చెందిన ప్రాంతంలో పలుకోణాల్లో పరిశీలించి విచారణ చేపట్టారు. సిసి కెమెరా ద్వారా దిలీప్ దీనికి బాధ్యుడై ఉండాడని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలిక మృతదేహాన్ని నాయుడుపేట సామాజిక వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

### నేటి నుండి ప్రతి మండలంలో
## కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాలు
### జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు టౌన్, జులై 17 ప్రభాతవార్త:



అర్డీఓలు, తహసిల్దార్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు.

బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలను కట్టడి చేయడానికి గురువారం నుండి ప్రతి మండల కేంద్రంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం జిల్లా పౌరసరఫరాల అధికారి, అర్డీఓలు, సివిల్ సప్లైస్ డిఎం, తహసిల్దార్లు, సిఎస్‌డిటిలతో బహిరంగ మార్కెట్‌లో నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణపై తీసుకుంటున్న చర్యలపై టెలికాన్ఫరెన్స్ ద్వారా జెసి సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణలో భాగంగా బియ్యం, కందిపప్పు, నూనెలను రైతు బజారు, రైతు బజారుల్లోని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన ఫైన్ వెరైటీ బిపిటి స్టీమ్ బియ్యం కేజీ రూ.49, పచ్చి బియ్యం కేజీ రూ.48, కందిపప్పు(దేశవాళి) కేజీ రూ.160, పామోలిన్ నూనె లీటరు రూ.90లకు విక్రయించడం జరుగుతున్నదన్నారు. ఈ క్రమంలో పౌరసరఫరాల శాఖ కమీషనర్ ప్రతి మండల కేంద్రంలో బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్లకు ఆదేశించారని ఈ మేరకు చర్యలు చేపట్టనున్నామన్నారు. ప్రతి మండలంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడానికి ప్రతి మండల పరిధిలోని రైస్, ధాన్యాల హోల్‌సేల్ డీలర్లతో రీటైల్ షాప్స్, మార్కెట్ రిలయన్స్, ఇతర పెద్ద సూపర్ మార్కెట్ల వారితో మాట్లాడి ప్రతి సూపర్ మార్కెట్ నందు నాణ్యమైన ఫైన్ వెరైటీ బిపిటి బియ్యం కేజీ రూ.49, పచ్చిబియ్యం కేజీ రూ.48, కందిపప్పు కేజీ రూ.160లకు ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి విక్రయించడానికి చర్యలు చేపట్టాలన్నారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ఘన స్వాగతం



రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ క్యాబినెట్ మంత్రి నితిన్ గడ్కరికి బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రోడ్ల భవనాల ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రోటోకాల్ ఎస్‌డీసీ రాంమోహన్, ఆర్డీవో శ్రీకాళహస్తి రవిశంకర్‌రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వో ఆర్.కె.సింగ్, ఏపీఆర్‌వో రాకేష్ కుమార్, సీవో రామచంద్రరావు, పీడీ ఎన్.వెంకటేష్, రోడ్డు భవనాల ఎస్ఈ మధుసూదన్‌రావు, మాజీ టీటీడీ సభ్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు భానుప్రకాష్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర మంత్రి ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లోఏపీ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులపై అధికారులు, ప్రజాప్రతినిధులతోసమీక్షించి, మదనపల్లికు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

## తొండమాన్‌పురంలో తొలిఏకాదశి పూజలు

శ్రీకాళహస్తిరూరల్,జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండవమాన్‌వురంలోని శ్రీదేవి,భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తొలిఏకాదశి సందర్భంగా ఆలయం కిట కిటలాడింది. తొలిఏకాదశి ప్రధాన్యతను ఆలయ పూజారి జయ స్వామి భక్తులకు వివరించారు. స్వామి ఇక్కడ ప్రసన్న వదనుడై వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. కాబట్టి ఇక్కడి స్వామి విగ్రహం ప్రశాంతంగా కూర్చొని ఉండటం గమనించదగ్గ విషయం.తొలిఏకాదశి సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పిండిదీపాలు వెలిగించారు. ఉదయం ఏకాంత సేవ తరువాత అర్చన హారతులతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.ధ్వజస్థంభం ఎదురుగా మహిళలు పిండిదీపాలను వెలిగించి మొక్కులు మొక్కుకున్నారు.వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఇన్స్‌పెక్టర్ రవి ఏర్పాట్లను సమీక్షించారు.

## టమోటా పంటపై గజరాజుల స్వైర విహారం

### - రూ. 5లక్షల వరకు పంటనష్టం

చౌడేపల్లి, జూలై 17 ప్రభాతవార్త

గత వారం రోజులుగా ఏనుగులు ఈ ప్రాంత రైతులకు కంట నిద్ర లేకుండా చేస్తున్నాయి. మంగళవారం రాత్రి ఏకంగా గ్రామాల శివారు ప్రాంతాల్లోగల టమోటా పంటలను ధ్వంసం చేసాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని ఆమినిగుంట, పందిళ్ళపల్లి, శెట్టిపేట పంచాయతీ మధురమలై అటవీ ప్రాంతానికి సమీపంలో వున్నాయి. అడవిలోంచి తరచూ చుట్టుపక్కలున్న పొలాలపై పడే గజరాజులు ప్రస్తుతం గ్రామాల సమీపాన వున్న వాణిజ్య పంటలపై పడి నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. బూరగపల్లి కత్తిరేపల్లి అంకమ్మ, నారాయణరెడ్డి, రెడ్రిప్రసాద్, అజ్జపల్లి ఆంజిరెడ్డి, రామచంద్రారెడ్డి, కొత్తపల్లి వెంకట్రెడ్డి తదితరులకు చెందిన టమోటా, మామిడి, అరటి తోటలను ఏనుగులు ధ్వంసం చేసాయి. ప్రస్తుతం టమోటాకు మార్కెట్‌లో ధరలు ఆశాజనికంగా వుండటంతో ఏనుగుల విధ్వంసం వల్ల దాదాపు రూ. 5లక్షల వరకు పంటనష్టం సంభవించినట్లు రైతులు తెలుపుతున్నారు. వ్యవసాయం జూదంలా మారిన ప్రస్తుత సమయంలో చేతికందిన పంటను గజరాజులు నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పొలాల వద్ద కాపలా వుండాలంటేనే భయపడాల్సి వస్తుందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల నుంచి పంటలు, ప్రాణాలను కాపాడాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలంటున్నారు.



## సమన్వయంతో పనిచేద్దాం: తిరునాళ్లను విజయవంతం చేద్దాం : ఇఓ

శ్రీకాళహస్తి జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయటానికి అన్నిశాఖల అధికా రులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని బుధవారం జరిగిన సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వియస్ఎన్ మూర్తి పిలుపు నిచ్చారు.ఆలయ పరిపాలనా భవనంలోని సమావేశం హాలులో ఏర్పాటు చేసిన సమావేశా నికి ఇఓ అధ్యక్షత వహించారు.బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యాయి.ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు ప్రధాన ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తారని వివరించారు. కాబట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని శాంతి భద్రతల పరిరక్షణ కల్పించాలని చర్చించారు. ఇక్కడ ఉత్సవాలు ఆలయ కార్యనిర్వహణాధికారి, డివైయస్‌పి ఇద్దరు అధికారులకు కొత్తే. ఎంత జనం వస్తారు? కార్యక్రమాలు ఎలా ఉంటాయన్నది తెలియదు.ఉత్సవాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్యం,మంచినీటి సరఫరాలకు సంబంధించి కమిషనర్ ఎం.రమేష్ బాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులతో చర్చించారు. నాలుగు రోజుల పాటు ఇక్కడ ప్రత్యేకంగా పారిశుధ్యానికి కార్మికులను నియమిస్తామన్నారు.ఇక ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ ఎంతో ముఖ్యం. చెన్నై, పిచ్చాటూరు మార్గాల నుంచి అధిక సంఖ్యలో బస్సులు వస్తాయని,లారీలు, ఆటోలు నడుస్తాయని చర్చించారు. గతంలో అమలు చేసిన ప్లాన్‌ను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి,సిఐ రారాజు వివరించారు. కాగా ఉత్సవాల సమయాల్లో మరో కీలకశాఖ అగ్నిమాపక కేంద్రం,వాహనం. అందుబాటులో ఉండాలని తాము ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని అగ్నిమాపక శాఖ అధికారి భరోసా ఇచ్చారు. అందరం సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాల్లోని మూడు రోజులు విజయవంతం చేద్దామని చర్చించారు. శుక్రవారం అర్జున తపస్సు, ఆదివారం ఉదయం పొంగళ్లు, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశానికి సంబంధించి చర్చించారు. ఈ సమావేశంలో ఇఓ ఎస్‌వియస్ఎస్ మూర్తి,ఇఇ నూకారత్నం, డివైయస్‌పి ఉమామహేశ్వరరెడ్డి సిఐ రారాజు, నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్‌శ్రీనివాసులు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,రవిబాబు, నాగభూషణం యాదవ్,సతీష్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి విజిలెన్స్‌తో సమన్వయంగా విధులు
### -నూతన ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల,జులై 17ప్రభాతవార్త



పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తులను మోసగించే దళారులపై ఉక్కుపాదం మోపాలని, భక్తులకు దర్శనం, వసతి కల్పన పారదర్శకంగా అందుకునేలా పోలీసులు కూడా తగిన సహకారం ఇవ్వాలని తిరుపతి జిల్లా నూతన ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచిం చారు. భక్తుల భద్రతతోబాటు నేరాల నియంత్రణ, ఆలయ రక్షణపై టిటిడి విజిలెన్స్‌తో సమన్వయం చేసుకుని పనిచేయాలని నిర్దేశించారు. దేశం నలుమూలల నుండి తిరుమలకు భక్తులు వస్తుంటారని, వారితో పోలీసులు గౌరవంగా మాట్లాడి, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎల్.సుబ్బరాయుడు ఆకస్మికంగా 1టౌన్, 2టౌన్, క్రైమ్ పోలీసుస్టేషన్‌లను, కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరును తనిఖీ చేశారు. సిఐలు విజయకుమార్, సత్యనారాయణకు ఎస్పీ ప్రత్యేకంగా సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో తిరుమల అదనపు ఎస్పీ విమలకుమారి, డిఎస్పీ శ్రీనివాసాచారి ఉన్నారు.

## వైష్ణవాలయాల్లో ఏకాదశి పూజలు

చౌడేపల్లి, జూలై 17 ప్రభాతవార్త



మండలంలోని వైష్ణవాలయాల్లో ఏకాదశి పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆషాడమాసంలో వచ్చే ఏకాదశిని తొలి పండుగలా జరుపుకోవడం తెలిసిందే. స్థానిక వేణుగోపాలస్వామి, రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి, చౌడేపల్లి కమలాంజనేయస్వామి, కరణంవారిపల్లి అభయాంజనేయస్వామి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేసి మొక్కులు చెల్లించారు.

## నేడు కలెక్టర్‌చే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

– ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం కుప్పం మండల కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గా ఠధీ సుమిత్‌కుమార్‌చే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం పదిగంటలనుంచి జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అర్జీల రూపంలో ఉన్నతాధికారులకు అందజేయాలని కోరారు.

## కదిరి నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం

– ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూలై 17 ప్రభాతవార్త



మండలంలోని నూలుకుంట శ్రీ కదిరి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం నూలుకుంట గ్రామంలోని శ్రీ కదిరి నరసింహస్వామి ఆల యాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన ఆలయ ఛైర్మన్‌గా సంపంగిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సహకారంతో నియోజకవర్గంలోఉన్న పది ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. దేవదాయశాఖపరిధిలో లేకున్నావలుఆలయాలఅభివృద్ధికి సైతం తాము తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి సాంబశివ ం, నేతలు రామచంద్ర, కృష్ణమూర్తి, వసంతమ్మ, మంజు, మహేంద్ర, మణి పాల్గొన్నారు.

## పెద్దపంజాణి ఎస్ఐగా సహదేవి బాధ్యతలు

పెద్దపంజాణి జూలై 17 ప్రభాతవార్త :

పెద్దపంజాణి నూతన ఎస్ఐగా బి.సహదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇదివరకు పలమనేరు పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహించేవారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీ కావడంతో గత కొంతకాలంగా పెద్దపంజాణి ఎస్ఐ పోస్టు కాళీగా ఉన్ననేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాదికారులు పెద్దపంజాణి ఎస్ఐగా సహదేవిని నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలిని కోరారు.

## మోటారు సైకిళ్ళ దొంగ అరెస్ట్ : 12 వాహనాలు స్వాధీనం

కాణిపాకం, జూలై 17 ప్రభాతవార్త:



చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేసి సుమారు 7.12 లక్షలు రూపాయలు విలువగల 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం కాణిపాకం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాణిపాకం ఎస్సై రామ్మోహన్ తమ సిబ్బందితో కలసి బుధవారం ఉదయం పోలీస్‌సేషన్ పరిధిలోని మద్దిపట్లపల్లె క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డికి చెందిన తుమ్మల ఈశ్వర్ అలియాస్ కోటేశ్వరరావు అలియాస్ కోటి అనే వ్యక్తి పోలీసులను చూచి బయపడి తన వాహనంలో పారిపోతుండగా పట్టుకుని వాహనంకు సంభందించి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా చోరీల విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఈమేరకు చెడు వ్యవసనాలకు బానిసైన తుమ్మల ఈశ్వర్ గత కొద్ది రోజులుగా చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, రేణిగుంట, కాణిపాకం తదితర ప్రాంతాల్లో మోటారు సైకిళ్ళను దొంగతనం చేసి తక్కువ ధరకు ఇతరులకు విక్రయించేవారని తెలిపారు. దీనిపై నిందితుడు తుమ్మల ఈశ్వర్‌పై పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈమేరకు గత కొద్ది రోజులుగా చోరీ చేసిన వాహనాలను మద్దిపట్లపట్లపల్లె గ్రామపంచాయతీ శివరాంపురం ఎస్టీ కాలనీ వద్ద ముళ్ళపొదల్లో దాచివుంచగా సుమారు 7.12 లక్షలు రూపాయలు విలువగల 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా వుండగా వాహనదారులు తమ ఇళ్ళవద్ద తమ వాహనాలకు తాళాలు వేసి వుంచాలని, అలాగే ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని సూచించారు. దొంగను చాకచక్యంగా అరెస్ట్ చేసిన కాణిపాకం ఎస్సై రామ్మోహన్, సిబ్బందిని సీఐ రవిశంకర్‌రెడ్డి అభినందించారు. ఈవిలేకరుల సమావేశంలో కాణిపాకం ఎస్సై రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నేడు డయల్ యువర్ ఎమ్మెల్యే

చిత్తూరు టౌన్, జూలై 17 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు గురువారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవవాలనుకొనే వారు 98499 07885 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు ప్రస్తావించవచ్చును. ఈ కార్యక్రమానికి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు హాజరు కానున్నారు. అలాగే గత వారంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై అధికారులు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌నయుడుకు సమస్యల వాస్తవ స్థితిపై నివేదిక ఇవ్వనున్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట,జూలై 17,ప్రభాతవార్త:



టిడిపి గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి,పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. వి.కోట మండల కేంద్రంలో బుధవారం నాయకులు,కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని పార్టీ కోసం పని చేసి కష్టాలతోపాటు నష్టాలను చవిచూసిన కార్యకర్తలను ఆర్థికంగానూ ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. గతానికి భిన్నంగా ఈ దఫా పరిపాలన ఉంటుందని పంచాయితీల వారిగా నాయకులు సమిష్టిగా తీసుకునే నిర్ణయం మేరకే స్థానికంగా పనులు జరుగుతాయన్నారు. కాబట్టి నాయకులందరూ ఏకమై సమిష్టిగా నిర్ణయాలు చేయాలని సూచించారు. ఇక మనపై భరోసాతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సైతం న్యాయం చేసేలా నాయకుల పనితీరు ఉండాలని అన్నారు. అనంతరం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వి.కోట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ నిర్వహించిన ఎమ్మెల్యే ఆసుపత్రికి వచ్చిన రోగులను సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం గదిని ఏర్పాటు చేయాలని వైద్యలు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళుతామని తెలిపారు.

# అక్రమంగా ఇటుక బట్టీల వ్యాపారం

– చెరువులను గుల్ల చేస్తున్న ఇటుక బట్టీ మాఫియా
– అక్రమంగా తమిళనాడుకు తరలించి లాభాలు దండుకొంటున్న వ్యాపారులు



పాలసముద్రం, జూలై 17 ప్రభాతవవార్త:

పాలసముద్రం మండలంలో అక్రమ ఇటుక బట్టీ వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి త్రవ్వి, అటవీ అధికారుల కళ్ళను గప్పి ఇటుకలను కాల్చడానికి భారీగా కలపను అక్రమంగా తరలించి, విద్యుత్‌శాఖ కళ్ళుగప్పి విద్యుత్ సరఫరాను అక్రమంగా వినియోగించుకుని ఉత్పత్తి చేస్తున్న ఇటుకలను తమిళనాడు రాష్ట్రానికి తరలించి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. మండలం నుండి అనునిత్యం తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా ఇటుకలు తరలి వెళ్తున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు మిన్నంటుతున్నాయి. పాలసముద్రం మండలం తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో వుండటం, మండల పరిధిలో కొన్ని ప్రాంతాల్లోని మట్టితో ఇటుకల తయారీ నాణ్యంగా వస్తుండటంతో తమిళనాడులోని కొంతమంది వ్యాపారులు ఇక్కడ ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడానికి దోహదం చేసింది. గత ఐదేళ్ళుగా వైకాపా ప్రభుత్వం అధికారంలో వుండటంతో కొంతమంది తమిళనాడుకు చెందిన వ్యక్తులు ఇక్కడి వైకాపా నాయకులతో ఒప్పందం చేసుకొని ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. ఐదేళ్ళ పాటు ఇక్కడి నుండి తమిళనాడుకు అక్రమంగా ఇటుకలను రవాణా చేసి లాభాలు ఆర్జించిన వ్యక్తులు మండలంలో కొత్త ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకొని మరింత ఆదాయం కోసం సిద్ధం అవుతున్నారు. మండల పరిధిలో పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు ఏర్పాటు అవుతున్నప్పటికీ అధికారుల్లో ఎలాంటి స్పందన వుండటం లేదు. తమిళనాడుకు చెందిన కొంతమంది వ్యక్తులు మండల పరిధిలో సుమారు 20 నుండి 25 ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి ఇక్కడి నుండి తమిళనాడుకు ప్రతిరోజు ఇటుకలను అక్రమంగా తరలించి లాభాలు ఆర్జించుకుంటున్నారు. ఇటుక బట్టీలు వున్న ప్రాంతాల్లో కాలుష్యం వెదజల్లుతున్నప్పటికీ, పంట పొలాలు నాశనం అవుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడు కరువు అయ్యారు. ఇటుకలు తయారు చేసి తమిళనాడుకు సరఫరా చేస్తే మంచి లాభాలు వస్తుండటంతో కొంతమంది ఇదే పనిగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. అటవీ ప్రాంతల సరిహద్దులు, చెరువులు, కాలువల సమీపాల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేసి అక్కడ ఇటుకల తయారీకి అనువైన మట్టికొ కొల్లగొడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంటే ఈ విద్యుత్‌ను ఇటుక బట్టీల ఏర్పాటుకు దుర్వినియోగం చేసి వ్యాపారులు విద్యుత్ శాఖను మోసం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జరిగిన ఈ అక్రమ ఇటుక వ్యాపారులను ఈ ప్రభుత్వంలోనైనా కట్టడి చేయడానికి అధికారులు పూనుకోవాల్సి వుంది.

## అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలి : డిఎంహెచ్ఓ ప్రభావతి

–మాతా శిశుమరణాలు అరికట్టాలి

చౌడేపల్లి, జూలై 17 ప్రభాతవార్త

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలను పట్టి పీడిస్తున్న అంటు వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతి అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయాల స్థాయిలో మాతా, శిశు మరణాలను అరికట్టాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో వెనుకబడకుండా చౌడేపల్లి ఆరోగ్య కేంద్రాన్ని ఉన్నత స్థానంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి రోజూ వైద్యాధికారులు సమయ పాలన పాటించి నిబంధనల మేరకు ఆసుపత్రుల్లో సేవలందించాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. వైద్యుల హాజరు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకొన్నారు. అదే విధంగా పలు రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో శిథిలావస్థకు చేరుకొన్న భవనాల తొలగింపు పరిశీలనలో వుందన్నారు. వైద్యాధికారి పిహెచ్ఎన్ కృష్ణవేణమ్మ, జమున, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా జిల్లా వైద్యాధికారి ఆరోగ్య కేంద్రానికి వచ్చినప్పటికీ ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి - ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి.

– ఎమ్మెల్యేచే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం..ప్రారంభం.

పెద్దపంజాణి జూలై 17 ప్రభాతవార్త :



పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు శక్తి వంచనలేకుండా కృషిచేస్తానని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గంలో పలుఅభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టారు. మండలంలోని మాధనపల్లి పంచాయితీలో కత్తార్లపల్లి నుంచి కర్నాటక బార్డర్ వరకు 1.52కోట్ల రూపాయలతో నిర్మించే నూతన సి.సి రోడ్లపనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. అలాగే అప్పినపల్లి పంచాయతీ కేంద్రంలో ఎన్టీఆర్ సుజల శ్రవంతి ఆర్వోప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొన్నేళ్ళుగా కత్తార్లపల్లి గ్రామస్తులు రోడ్డుసౌకర్యం లేకపోవడంతో త్రీవ్ర అవస్తలు పడేవారని పేర్కొన్నారు. ఈ రోడ్డును అధికారంలోకి రాగానే నిర్మిస్తామని గతంలోనే తానుఇచ్చిన హామీమేరకు రోడ్డునిర్మాణాన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రజలకు శుద్దత్రాగునీటి జలాలు అందించేందుకుగాను ఎన్టీఆర్‌సుజల పథకంలోభాగంగా గ్రామాల్లో ఆర్వోప్లాంట్లు నీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రజలకు సురక్షిత మంచినీటిని అన్ని గ్రామాల్లో పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అంచలవారిగా గ్రామాలను ఆయాగ్రామాలకు అవసరమైన మౌళికవసతులను కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా ఎన్నికల ఫలితాలువచ్చాక నెలరోజుల్లోనే ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తమ గ్రామాల అభివృద్ధి చూపడంపట్ల గ్రామస్తులు హర్షంవ్యక్తంచేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయ్ భాష్కర్ రెడ్డి, మండల టీడీపీ కార్యదర్శి చలపతి, నేతలు మురహరి రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, జి.నాగరాజు, ముబారక్, రెడ్డెప్ప, శంకరప్ప, ఎల్లప్ప, రామకృష్ణ, బాను ప్రతాప్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## శ్రీభ్రరాంబసమేత శ్రీసంతకాళహస్తీర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కోట, జూలై 17 ప్రభాతవార్త



కోట మండలం తిమ్మానాయుడపాళెం గ్రామంలో 500 సంవత్సరాల ముందు నిర్మించిన శ్రీభ్రరాంబ సమేత శ్రీసంతకాళహస్తీశ్వరస్వామి ఆలయాన్ని మూడు కోట్లు రూపాయాల వ్యయంతో పునం నిర్మాణం చేపడుతున్నారు. అందులో భాగంగా బుధవారం నూతన ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెసిబి సహాయంతో ద్వార బంధరాలను ఏర్పాటు చేశారు. ఆలయ దర్మకర్త మల్లాపు శెట్టి రమేష్‌బాబు దంపతులు ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు ,గ్రామస్దులు ద్వారబందరాలకు ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ ధర్మకర్త రమేష్‌బాబు మాట్లడుతూ ఈ ఆలయ నిర్మాణం మొత్తం గ్రానెట్ రాయితో నిర్మాణం జరుగుతుందన్నారు. ఆర్థిక భారం ఎక్కువగా ఉన్నందున ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆయన కోరారు. ఆలయ పాలక మండలిసభ్యులు, గ్రామస్తులు వీర రాఘవశెట్టి, మాజీ సర్పంచ్ ఆనందకృష్ణ, ఎండోమెట్ డిప్యూట్ ఎగ్జిక్యూటివ్‌ఇంజినీర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన పోలీసు సిబ్బంది

గూడూరు, జులై 17, ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గ పరిధిలోని ఏఎస్ఐ, పోలీస్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, మహిళా పోలీస్ సిబ్బంది వారి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌ని కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, శాసన సభ్యులతో ఉద్యోగం రిత్యా ఏదైనా పని మీద తిరుపతికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో నియోజకవర్గాన్ని కలిపినందు వలన ఉద్యోగస్థులుగా అక్కడికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లా నుండి తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశింసునీల్ కుమార్ మాట్లాడుతూ గతంలో కూడా నెల్లూరు జిల్లాలో కలిపేందుకు నియోజకవర్గ ప్రజలు అందరితో కలిసి పోరాటం చేసామన్నారు. నారా లోకేష్ బాబు యువగలం పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించినప్పుడు అధికారంలోకి రాగానే ఆ దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే చంద్రబాబు నాయుడు ఎలెక్షన్ ప్రచారంలో పర్యటించినప్పుడు కూడా వారికి తెలిపామని వారు పరిగణలోకి తీసుకుని చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెలలో జరిగే అసెంబ్లీ సెషన్‌లలో కూడా ఈ విషయం పై అసెంబ్లీలో మాట్లాడి మన నియోజకవర్గంని తిరిగి నెల్లూరు జిల్లాలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

## మౌలిక వసతులు కల్పిస్తాం

పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు వెల్లడి

గూడూరు, జులై 17, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని పుచ్చలపల్లి సఉుందరయ్య కాలనీను పురపాలక కమిషనర్ సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదలు నివసించే సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి కాలనీలో పర్యటించి త్వరిత గతిన మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుందరయ్య కాలనీలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈయన వెంట బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్టా శంకరయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామకృష్ణతోనే అభివృద్ధి సాధ్యం

మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు

బాలయపల్లి, జులై 17, ప్రభాతవార్త



ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతోనే అభివృద్ధి సాధ్యమని మండల టిడిపి అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, మాజీ ఏఎంసి ఛైర్మన్ సింగంశెట్టి భాస్కర రావు, టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, రావి సత్యం నాయుడు, కూని శ్రీహరి, టిడిపి శ్రేణులు ఘనంగా సన్మానించారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మస్తాన్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామకృష్ణ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జన్మదినం సందర్భంగా అనంతరం శ్రీశ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటగిరి నియోజకవర్గానికి కురుగొండ్ల చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు కొనియాడారు. రైతులకు, శ్రామికులకు కురుగొండ్ల రామకృష్ణ ఎల్లప్పుడూ అండగా ఉంటారని శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని జడపల్లి కోటేశ్వర గౌడ్ ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో టిడిపి నేతలు సివికే నాయుడు, కె వెంకట్రాది, రావిసత్యం నాయుడు, రఘురాం రెడ్డి, నల్లబోతుల మురళి, కేథరి ఉదయ భాస్కర యాదవ్, గాజులపల్లి కోటి, బి. మురళి మోహన్ రెడ్డి, గోపికృష్ణ రెడ్డి, ప్రసాద్ నాయుడు, గోపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకే జీవితం అంకితం

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 17, ప్రభాతవార్త



ప్రజాసేవకే జీవితం అంకితం చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. కస్తూరి బా గాంధీ పాటశాలలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు పూలు చల్లుతూ ఘనంగా ఎమ్మెల్యే స్వాగతం పలికారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి కేక్‌ను వారికి తినిపించారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు తనను మూడుసార్లు గెలిపించాలని వారి రుణాన్ని తీర్చుకోవటానికి తెలిపారు. తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని చెప్పారు. అనంతరం నివాస గృహంలో పార్టీ కార్యకర్తలు నాయకులు ఏర్పాటు చేసిన కేసును కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. గజమాలతో ఎమ్మెల్యేను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే రామకృష్ణకు అధికారులు నాయకులు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, మాజీ జడ్పిటిసి ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోహన్ రెడ్డి, నాయకులుప్రసాద్ నాయుడు, రాజేశ్వర రావు, పలు శాఖల అధికారులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

వెంకటగిరి, జులై 17, ప్రభాతవార్త



కురుగొండ్ల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల ఐక్యవేదిక వారు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక గద్దల మునయ్య, ఎమ్మార్పీఎస్ వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి మంగళపూరి సురేష్ మాదిగ మాట్లాడుతూ వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా డక్కిలి మండలంలోని కందలవారిపల్లిలో గిరిజన విద్యార్థులకు ఉచితంగా నోట్, ఎక్కాల బుక్స్ పెన్సిల్స్ ఎరేజర్స్ షాప్ నర్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తన్నీరు వెంకటేశ్వర్లు, విద్యార్థుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎంపిడిఓ అరుణ

బాలాయపల్లి, జులై 17, ప్రభాతవార్త

మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు వెలుగు సమావేశ మందిరంలో ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడివో అరుణ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిధిగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ హాజరవుతారని తెలిపారు. త్రాగునీరు, పారిశుద్ధ్యత, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి హామీ, గ్రామీణ అభివృద్ధి ఇంకా పలు అంశాలపై చర్చిస్తారని తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్‌లు స్వాధీనం

వాకాడు, జులై 17, ప్రభాతవార్త



అక్రమంగా రెండు ట్రాక్టర్‌లో ఇసుక లోడు చేస్తుండగా సమాచారం మేరకు సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బందితో హుటాహుటిన బయలుదేరి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. బుధవవారం సిఐ శ్రీనివాసులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం సమీపంలో వున్నా స్వర్ణముఖి నదిలో రాత్రి వేళలో రెండు ట్రాక్టర్‌లో పదివేల చొప్పున జరిమాన వేసి పూసిలతో విడుదల చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సెబ్ కానిస్టేబుల్ మునిరాజా కుమార్, తదితరులు ఉన్నారు.

## ఆగస్టు 25న టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు

గూడూరు, జులై 17, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఈ సంవత్సరం కూడా 18 మండలాల జట్లతో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు ఆగస్టు 25,26,27,28 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రికెట్ లీగ్‌లో పాల్గొనుచున్న 18 మండలాల టీం కెప్టెన్స్‌తో బుధవారం సనత్ నగర్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ నందు క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ సంబంధించి పలు అంశాలు, చర్చించి లాటరి పద్ధతి ద్వారా 18 టీమ్స్‌కు స్పోర్ట్స్ వేర్ కలర్స్‌ను నిర్ణయించడమైంది. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ టీచర్స్ కొరకు ఈ టోర్నమెంట్‌ను రాష్ట్ర స్థాయిలో నిర్వహించుటకు కూడా ప్రణాళిక సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, ముని భాస్కర్, మురళి సింగ్, బాబార్, మణి, పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించండి

ప్రాణాలను కాపాడుకోండి

గూడూరు, జులై 17, ప్రభాతవార్త



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాలెం కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన నిర్వహించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను ధరించాలని తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు రెట్టింపు భరోసా..!

## కూటమి ప్రభుత్వం కానుక

కోట,జులై 17 ప్రభాతవార్త

కడలి కెరటాలే మత్స్యకారులకు కడుపు నింపే కాల చక్రాలు.. మర పడలే మంచి స్నేహితులు సునామీతో సేహ్నం.. తుపానులతో సహజీవనం సాగిస్తూ ప్రాణాలే పెట్టుబడిగా బతుకు నావను తీరానికి చేర్చేందుకు నానా కష్టాలు పడుతుంటారు. కటుంబాలకు దూరంగా రోజుల తరబడి నడి సంద్రంలో చేపల వేటకు వెళ్తారు. ఏ కష్టం తలెత్తకుండా తిరిగి వస్తామనే భరోసా లేకపోయినా గంగమ్మ తల్లి కాపాడుతుందేనే మొండి ధైర్యంతో ముందుకు వెళ్తారు. వల చిరిగినా, చేపలు పడకపోయినా, పడవ మొరాయించినా నిరాశ చెందని అమాయకపు జీవితాలు వీరివి. అంతటి దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్న మత్స్యకారులకు అయిదేళ్ల వైకాపా పాలనలో కనీస ప్రోత్సహం కరవైంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు కడలిలో చేపలు గుడ్ల పెట్టి పొదగడం, ద్వారా మత్స్య సంపద వృద్ది చెందుతుందని గుర్తించి వేట నిషేదం అమలు చేస్తున్నారు. ఈ సమయంలో మత్సకారులెవరూ సముద్రంలోకి వెళ్లి వేట సాగించేందుకు వీలు లేదు. నిషేద కాలానికి సంబంధించి ఒక్కో మత్సకారుడికి గత ప్రభుత్వం రూ 10 వేలు వరకు మత్స్యకార భృతిని అంద చేసింది. ఇప్పటి వరకు మత్స్యకార భరోసా పథకం కింద అందిస్తున్న లబ్దిని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రెట్టింపు చేసి రూ 20 వేలు అందిచనుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులకు భరోసా మొ త్తాన్ని పెంచుతామన్న హామ మేరకు ఈ నిర్ణం తీసుకున్ననట్లు అధికారులు తెలిపారు. దీంతో మత్స్యకారులల ఆనందోత్సాహాలు వెల్లరిస్తున్నాయి. జిల్లాలో చేపల వేట పై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులందిరికి భృతి అందదించాడానికి వీలుగా జాబితా సిద్ధం చేయాలని మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

## సుధీర్‌రెడ్డికి ఘన సత్కారం

రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని రేణిగుంట మండలం తూకివాకం మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆయనకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రికార్డు స్థాయి మెజారిటీతో గెలిచి ప్రజాసేవ చేస్తున్న గొప్ప నాయకునిగా సుధీర్‌రెడ్డిని వారు అభివర్ణించారు. సుధీర్‌రెడ్డి గెలిస్తే శ్రీవారు సన్నిధికి కాలినడకన వస్తానని శ్రీనివాసులు మొక్కుకున్నారు. శ్రీవారి మొక్కు చెల్లించుకుని నేరుగా శ్రీకాళహస్తిలో ఉన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలసి శ్రీవారి ప్రసాదాలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పంచాయతీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళగా అతి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, లోకేష్, జయప్రకాష్ పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడు మృతి

రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త:



రేణిగుంట రైల్వేస్టేషన్ సౌత్ క్యాబిన్ సమీపంలో సుమారు 45 సంవత్సరాలు యువకుడు రైలు కింద పడి మృతి చెందినట్లురేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలం చేరుకున్నారు. మృతుని వద్ద పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. చనిపోయిన వ్యక్తి పాచికలరు బనీను ధరించి ఉన్నాడు. కుడి చేతిపై కుమార్ బీ అనే పేరు పచ్చబొట్టుతో ఉంది. బీ అనే అక్షరం ఇంగ్లీషులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించామన్నారు. చనిపోయిన వ్యక్తిని గుర్తించిన వారు 9963126343 మొబైల్ నెంబర్‌కు తెలియజేయాలని రైల్వే ఎస్ఐ కోరారు.

## ప్రజల వద్దకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి హెల్త్, జులై 17, ప్రభాతవార్త



తిరుపతిలోని టిటిడి అడ్మినిస్టేటివ్ బిల్డింగ్ అసోసియేషన్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మమేకమై వాకింగ్ చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తమ వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని అక్కడ ఉన్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వాకర్స్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, దేవరాజులు, కెవి రమణయ్య, కృష్ణారెడ్డి, రఫీ, దాము, కేశవులు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళియంబాకంలో వైభవంగా గంగమ్మజాతర

విజయపురం, జూలై 17 ప్రభాతవార్త:

మండలంలోని కళియంబాకంలో బుధవారం గంగమ్మజాతర వైభవంగా జరిగింది. వీధుల్లో వేపతోరణాలు కట్టి విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధుల్లో మధ్యలో విద్యుత్ దీపాలతో అమ్మవారి ఆర్చి ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారికి అంబళి పోసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

## ఆటోలను కంట్రోల్ చేయండి..

శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో ఆటోల ఆగడాలు రోజు రోజుకు పెచ్చుపెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో మరే పట్టణంలో లేని విధంగా శ్రీకాళహస్తిలో సుమారు 10వేల ఆటోలు నడస్తున్నాయి. అయితే బతుకు జీవనం కోసం ఆటోలను నడుపుకోవటం తప్పు లేదు.కానీ ఏ మాత్రం ట్రాఫిక్ అవగాహన లేని వారు ఆటోలు తతీసుకొని అడ్డదిడ్డంగా తిరుగుతున్నారు. ఒన్‌వేలో అడ్డంగా రావటంతో ఇబ్బంది కల్గుతుంది.

పట్టణంలో రోజురోజుకు ఆటోల దోపిడి ఎక్కువైపోతుందని పట్టణానికి వచ్చే భక్తులను నిలువ దోపిడి చేస్తున్నారని పట్టణావాసులు చర్చించుకుంటున్నారు.ఆటోలను నడపడానికి కనీస వయస్సు 18 సంవత్సరాలు కూడా నిండని వ్యక్తులు ఆటోలు నడపడం వలన చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలో ఆటోలు నడపే వారిసంఖ్య గణనీయంగా పెరగడమే కాకుండా వీరి వలన తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.పట్టణంలోని ప్రధానంగా నాలుగుమాఢవీధులో వన్‌వేలలో వీరు దూరి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు.సాధారణంగా రైల్వేస్టేషన్ నుంచి ఆలయానికి 20 నుంచి 30 రూపాయలకు చార్జ్ చేస్తారు. వీరు ఒక్కొక్కరికి 50 నుంచి 100 వరకు వసూళ్ళు చేస్తున్నారు.అంతేకాకుండా మద్యంతాగి ఆటోలను నడుపుతున్నారు.ఏదైనా ప్రమాదం జరిగితే తూతూ మంత్రంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి శిక్ష వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆటోలు నడిపే వారికి యూనిఫాం లేకపోవడం గమనార్హం.మునుపటిలా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.ఆర్టీఓ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు వాపోతున్నారు.

## అప్పలాయగుంటలో 22న పుష్పయాగం

వడమాలపేట, జూలై 17 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జూలై 22వ తేదీ పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు, ఇతర ఉత్సవాల్లో ఏవైనా లోపాలు జరిగితే ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జూలై 21 సాయంత్రం అంకురార్పణ, 22వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి స్నపన తిరుమంజనం వేడుకగా చేపడతారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 2.40 నుంచిసాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. ఇందులో పలు రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. అనంతరం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. పుష్పయాగానికి వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శివకుమార్ తెలిపారు.

## మంత్రి నారా లోకేష్‌ని కలసిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి, జూలై 17 ప్రభాతవార్త:



రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కలిసి నగరి నియోజకవర్గ పరిధిలో ఐటీ రంగం అభివృద్ధికి ప్రయత్నించాలని సూచించారు. అలాగే విద్యా సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలు, ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్‌లను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కలసి నగరి నియోజకవర్గ ప్రజల సమస్యలను వారి దృష్టికి తెలిపారు.

## జిల్లా ఎస్పీచే ఐరాల పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఐరాల, జూలై 17 ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ మనికంఠ చందోలు బుధవారం ఐరాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ ఐరాల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు.. ఈసందర్భంగా పోలీసు స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా పోలీసుస్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. అలాగే స్టేషన్లో నమోదైన కేసుల వివరాల గురించి పరిశీలించారు. అలాగే పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం అమలవుతున్న కొత్త చట్టాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈతనిఖీల్లో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, కల్లూరు సీఐ శ్రీనివాసులు, డీసీఆర్‌బి సీఐ బాలయ్య,స్థానిక ఎస్సై రమేష్‌కుమార్, ఇబ్బంది పాల్గొన్నారు.

## ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరి, జూలై 17 ప్రభాతవార్త:



స్థానిక ఓంశక్తి ఆలయంలో బుధవారం నిర్వహించిన ఆలయ 38వ వార్షికోత్సవం, 32వ గురుపాదోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఓంశక్తి ఆలయంలో అభిషేక, అర్చనలు, 1008 పుష్పార్చనలు, పంచముఖ దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చక్రాలకుర్చీలు, దిండ్లు, బాలింతలకు రొట్టెలు, పండ్లు, బిస్కెట్లు, చెవిటి వారికి వినికిడి పరికరాలు, వికలాంగులకు చేతి కర్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరిం టెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అన్న దృక్పథంతో ఓంశక్తి ఆలయ నిర్వాహ కులు ఆస్పత్రికి, వికలాంగులకు పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. మధ్యాహ్నం ఓంశక్తి ఆలయంలో సహపంక్తి భోజనం నిర్వహించారు. జిల్లా ఆదిపరాశక్తి ఆధ్యాత్మిక సేవా కమిటీ అధ్యక్షుడు గంగాధరం,ఆర్ఎంవోకార్తికేయన్, వైద్యులు జరీనా, వైద్య సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి

శ్రీకాళహస్తి జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ సహాయ మంత్రి ఎస్‌పి సింగ్‌భఘేల్ కుటుంబసభ్యులతో వచ్చారు. వారికి ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్‌వియన్ మూర్తి ఆదేశాలతో ఎసి మల్లికార్జున్ ప్రసాద్ వేదపండితులతో స్వాగతం పలికారు.ఆ లయంలో పూజల అనంతరం వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందించారు.కేంద్ర మంత్రి రాక సందర్భంగా బిజెపి పార్టీకి చెందిన కార్యకర్తలు ఉత్సాహంగా ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్ర బిజెపి కార్యదర్శి కండ్రిగ ఉమ, అమర్ నాథ్,ఢిల్లి బాబు,మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఆలయాధికారులు మల్లికార్జున్ ప్రసాద్,పిఆర్‌ఓ సుబ్రమణ్యం, రవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వీరభద్రస్వామి ఆలయం వద్ద అన్నదానం

తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త



ఏకాదశి సందర్భంగా ఆలయంలో చిన్నసింగమాల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామికి పూజల అనంతరం ఆలయ సమీపంలో ఆలయ నిధులతో అన్నదాన కార్యక్రమాన్ని విశేష సంఖ్యలో నిర్వహించారు. సుమారు వందలాది మందికి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు మొత్తం అన్నదానానికి హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామానికి చెందిన గుర్రప్పతో పాటు ఎంపిపి ఉన్నం నిర్మలవాసుదేవనాయుడు, శ్రీకాళహస్తి మాజీ కౌన్సిలర్ శెంజిగరంసుప్రజ, వేలులతో పాటు పలువురు గ్రామస్తులు అన్నదాన పాల్గొన్నారు. ముఖ్యంగా యువత అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని వడ్డించడం జరిగింది.

## ఆట పాటలతో చదువు:అవగాహనకు హేతువు

సమరతా సేవా ఫౌండేషన్

శ్రీకాళహస్తి జూలై 17 ప్రభాతవార్త



నేడు చదువు అంటే పగలు రేయి తేడా లేకుండా పుస్తకాల్ని బట్టి పెట్టడం ర్యాంకుల కోసం ప్రాకులాడటం తప్ప చదువుతున్న చదువుపై అవగాహన రావటం లేదని సమరతా సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరాం తెలిపారు. బుధవారం పట్టణంలో సుమారు 800 మంది పురుషులు, మహిళా కార్యకర్తలతో నగర సంకీర్తన నిర్వహించారు.ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలు కేంద్రాలుగా ఎస్.ఎస్టి,మత్స్య కారుల పిల్లలకు ఆట పాటలతో చదువు నేర్పుటకు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నామన్నారు. పిల్లల్లో చదువుతో పాటు సమాజంలో ఎలా బతకాలనే అంశంపై అవగాహన కల్పించుటకు ఇలాంటి కార్యక్రమాలను సమరతా సేవ ట్రస్టు చేపట్టి అమలు చేస్తుందన్నారు. చదువు బాగా రావాలంటే మొదట సంస్కారం,మానవత్వం, ప్రేమ అనురాగాలు,అప్యాయతలు, కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు ఎలా కల్గి ఉండాలనే అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించుటకు ఆట పాటలతో చదువుతో పాటు సంస్కారం నేర్పుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని గంగాసదన్‌లో చిన్నారులకు ఈ నేపధ్యంలో అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమాల్లో సాయిరాం తో పాటు రాయల సీమ జోన్ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి,నెల్లూరు జోన్ అధ్యక్షులు వెంగళరెడ్డి,మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో మొహరం

శ్రీకాళహస్తి,జూలై 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భక్తి శ్రద్దలతో మొహరంను ఆచరించారు. సాధారణంగా మొహరం మాసం ఇస్లాం నెలలో మొదటిది. అయితే ఈ మాసంలో ఎన్నో విషాదకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ప్రవక్త మహమ్మద్ మనవడు హసన్ హుస్సేన్‌లు ఇస్లాం మత వ్యాప్తికి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన సంఘటనలు ఈ మాసంలో జరిగాయి. అంటే ఈ మొహరం పదిరోజులు సంతాప దినాలని చెప్పవచ్చు. రెండు రోజులుగా శ్రీకాళహస్తిలోని ముస్లింలు ఉపవాసదీక్షలు పాటించారు.పేదలకు భోజన వసతి కల్పించారు.

**అన్నదానం:**

శ్రీకాళహస్తిలో మొహరం సందర్భంగా బుధవారం సాయంత్రం ముత్యాలమ్మగుడివీధిలోని 'బారాఇమాం' మకాన్‌లో యువకులు అన్నదానం జరిపారు.ఈ కార్యక్రమాల్లో నాజ్ మీర్జాం సాహెబ్, షఫీ, షాకిర్ అలి,ఖలీల్,ఎస్ ఆర్ రఫీ,ఖలీల్, సలీం,నాగూర్,ఖాదర్‌బాషా,ఎస్ చాన్‌బాషా ముస్లింలు పాల్గొన్నారు. ఇక్కడే ముస్లింలు బుధవారం ఉపవాసదీక్షలను ఇఫ్తార్ చేసారు.పట్టణానికి చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

## ఘనంగా ఏకలవ్యుని జయంతి వేడుకలు

శ్రీకాళహస్తిరూరల్, జూలై 17 ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఏకలవ్య ని జయంతి వేడుకలను మండలంలోని అక్కుర్తి గ్రామంలో ఘనంగా నిర్వహిం చారు. తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసా రామయ్య, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాసా సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షురాలు అనగాని కృష్ణయ్య, , మండల అధ్యక్షుడు దాసవెంకటయ్య, పొన్నయ్య, శ్రీనివాసులు, విజయ్, నాగయ్య, గోపాలకృష్ణ, చలపతి, జగదీష్, మనస్వామి, శ్రీనివాసులు నాగయ్య, కాటయ్య, శివ, చిన్న, రత్నయ్య, చెంగల్రా యులు, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ సమస్యలను పరిష్కరించండి

రేణిగుంట, జూలై 17 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణ శివారులో ఉన్న బీసీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని వసతి గృహంలో ఉండి చదువుతున్న విద్యార్థులు ఎంపీ గురుమూర్తికి బుధ వారం వినతిపత్రం సమర్పించారు. హాస్ట ల్‌కు వెళ్లే మార్గం నడవడానికి వీలులే కుండా ఉందన్నారు. స్ట్రీట్ లైట్లు వెలగడం లేదన్నారు. ముళ్ళ పొదలు విపరీతంగా మార్గానికి ఇరువైపులా ఉండడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. హాస్టళ్ళలోని మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలన్నారు. ఆర్‌వో వాటర్‌ప్లాంటు చెడిపోవడం వలన స్వచ్ఛమైన నీరు లభించడం లేదన్నారు. ఈ మేరకు వారు ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం సమర్పించారు. సమస్యలు విని స్పందించిన ఎంపీ గురుమూర్తి ఎంపీ నిధుల ద్వారా ఆర్‌వో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు ఓ.వి.రమణ, కుప్పస్వామి, విద్యార్థులు రవీంద్ర, నరేష్, గణేష్, కార్తిక్, సంతోష్, బాలాజీ, యువరాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

### భూదందాలు, సహజవనరుల దోపిడిపై

## వాస్తవాలు తెలిపేందుకు శ్వేతప్రతాలు విడుదల

### టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ

తిరుపతి హెల్త్, జులై 17, ప్రభాతవార్త




ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడిలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తుందని టిడిపి తిరుపతి నియోజవర్గం ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడఉతూ ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని వాటి విలువ రూ. 35575 కోట్లు పైనే ఇళ్ళ పట్టాల పేరుతో 10 వేల ఎకరాలు, ఇసుక దందాలో రూ. 9750 కోట్లు దోచుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను రద్దు చేయడం జరిగిందని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసిపి నేతలు భూదోపిడికి పాల్పడ్డారు. ప్రైవేటు వ్యక్తిని ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌గా నియమించి పేద ప్రజల భూములను కొట్టేయాలని పన్నాగం పన్నారన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములు, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హయగ్రీవ భూములను, తిరుపతి, రేణిగుంటలోని మఠం భూములను, పుంగనూరులో 982 ఎకరాలను కూడా కొట్టేశారు. చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో రూ. 101 కోట్ల ఆస్తి కాజేసేందుకు యత్నించారు. వీటిపై విచారణ చేపట్టామన్నారు. 13800 ఎకరాల భూములను వైసిసి నేతలకు ధారాదత్తం చేశారు. తక్కువ ధరకు 40 వేల ఎకరాలు కొన్నారు. అధికారులను బెదిరించి భూములకు పట్టాలు తెచ్చుకునేవారు. వాటిలో భవనాలు కట్టుకున్నారన్నారు. తక్కువ ధరకు రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి ఇళ్ల స్థలాల కోసం అమ్మిన వైసిపి నేతల భాగోతాల గురించి సాక్షాధారాలతో సహా శ్వేతపత్రంలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపార్టీ అధ్యక్షులు చినబాబు, రాష్ట్ర నాయకులు సూరసుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మన్యం శ్రీనివాసులు, రజనీకాంత్ నాయుడు, ఆముదాల తులసి, సుబ్రమణ్యం, జిల్లా నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, కొట్టె హేమంత్ రాయల్, నగర నాయకులు సుబ్బారావు, దేపూరి నాగప్రతాప్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## టిటిడి విద్యాసంస్థల విద్యార్థులకు డీఈవో అభినందనలు

తిరుపతి విద్య, జులై 17, ప్రభాతవార్త



తిరుపతిలోని టిడిపి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు తైక్వాండో జిల్లా స్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నెల 14వ తేదిన తిరుపతి లోని ఎస్వీ వైద్య కళాశాల ఆడిటోరియంలో 3వ కప్పు చిత్తూరు జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిఫ్ - 2024 జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో శ్రీ కోదండరామ, శ్రీ గోవిందరాజస్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల రజత, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, టిటిడి విద్యా సంస్థల తైక్వాండో శిక్షకుడు కె. గోపినాయుడును టిటిడి విద్యా శాఖ అధికారి డాక్టర్ వై. నాగరాజు నాయుడుఅభినందించారు.భవిష్యత్తులోమరిన్నిపతకాలుసాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశీర్వదించారు.

## అంబేద్కర్ డిగ్రీ, పీజీ ఫీజు చెల్లింపు గడువు ఆగస్టు 18న ఆఖరు

తిరుపతి విద్య, జులై 17, ప్రభాతవార్త

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు రెండు, మూడు సంవత్సరాల ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఆగస్టు 18వ తేది చివరి గడువుగా నిర్ణయించినట్లు ఆ యూనివర్శిటీ 2022 -23, 2023 -24 విద్యా సంవత్సరాల్లో డిగ్రీ చేరిన విద్యార్థులు, రెండు, మూడు సంవత్సరాల ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు. 2023 - 24లో పీజీ చేరిన విద్యార్థులు రెండవ సంవత్సరం ఫీజు చెల్లించాలని కోరారు. యూనివర్శిటీ పోర్టల్, వెబ్ సైట్‌లో అడ్మిషన్ లింక్ ఉందని, ఆ లింక్ పైన క్లిక్ చేయగానే విద్యార్థి ఆడ్మిషన్ నెంబరు, పుట్టిన తేది టైపు చేశాక రిజిస్ట్రేషన్ పూర్తిఅవుతుందని, ఆ ఫామ్‌ను ప్రింట్ తీసుకుని దాని పైన ఉన్న తొమ్మిది అంకెల సంఖ్య ఆధారంగా ఫీజు చెల్లించాలని సూచించారు. డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, గూగుల్ పే, ఫోన్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని వివరించారు. విద్యార్థులు గడువు దాక ఎదురు చూస్తూ ఉండకుండా వెంటనే ఫీజు చెల్లిస్తే కోర్సు మెటీరియల్ (పుస్తకాలు) త్వరగా పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

**- త్వరలో అడ్మిషన్ నోటిఫికేషన్**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ, పీజీ అడ్మిషన్ నోటిఫికేషన్ వారం రోజుల్లో విడుదల చేస్తామని విజయకృష్ణా రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేసి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తామని వివరించారు.

## క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయండి

**-బిజెపి నేతలకు మాజీమంత్రి కులస్తే సూచన**

తిరుపతిటౌన్,జులై 17ప్రభాతవార్త:



రాష్ట్రంలో టిడిపి,బిజెపి,జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని బిజెపి కేంద్రమాజీమంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే అన్నారు. ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. తిరుపతికి విచ్చేసిన ఆయనకు బుధవారం తిరుపతి జిల్లా నాయకులు స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువ తో సత్కరించారు. క్షేత్రస్థాయిలోపార్టీని బలోపేతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెనుబాల చంద్రశేఖర్, గుండాల గోపీనాథరెడ్డి, జల్లిమధుసూదన్, జానర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, దీపక్‌యాదవ్, జయంత్‌కుమార్, మల్లారపురవి తదితరులు ఉన్నారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్నా

తిరుమల,జులై 17ప్రభాతవార్త:



శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నానని,ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నానని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి తెలిపారు.బుధవారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## మహాభారత ఉత్సవాలకు శాస్త్రసోక్తంగా ధ్వజారోహణం

రామచంద్రాపురం, జూలై 17 ప్రభాతవార్త:



పరమాల సమీపంలో వెలసియున్న శ్రీద్రౌపథి సమేత ధర్మరాజుల వారి ఆలయంలో మహాభారత ఉత్సవాలకు ఆలయ అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఏకవీర సేవ ఫౌండేషన్ ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణల నడుమ ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. మేళతాళాలు మంగళవాయిధ్యాలతో గరుడ చిత్రపటంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్థంభంపై ప్రతిష్టించారు. అనంతరం ఆలయంలోని ద్రౌపథి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరమాకులకండ్రిగలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో బుధవారం బండికుంభాలు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భీమసేనుడు ఏకచక్రాపురంలో ఇంటింటికీ వెళ్ళి పంచభక్షపరమాణ్ణాలను స్వీకరించి భకాసురుడికి ఆహారంగా ఎడ్ల బండిపై తీసుకెళ్ళడం, అక్కడ భకాసురుడిని భీమసేనుడు వధించడం వంటి ఘట్టాలను కళాకారులు ప్రేక్షకుల కళ్ళకు కట్టినట్లు అభినయించారు.

## ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్య పరిష్కారం

వడమాలపేట, జూలై 17 ప్రభాతవార్త:



నగరి నియోజకవర్గం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో మూడేళ్లుగా ఉన్న విద్యుత్ సమస్య పరిష్కారం జరిగినట్లు కల్లూరు గ్రామస్తులు తెలిపారు. వడమాలపేట మండలం కల్లూరు గ్రామంలోని ఎల్లమ్మ ఆలయానికి విద్యుత్ సప్లయ్ కోసం మూడేళ్లుగా వైసీపీ నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తమ గ్రామానికి వచ్చిన భానుప్రకాష్ దృష్టికి ఆలయానికి విద్యుత్ సమస్యను తీసుకెళ్ళడంతో వెంటనే ఆయన స్పందించి అధికారులతో మాట్లాడి పది రోజుల్లో సమస్యలను పరిష్కరించారు. బుధవారం అధికారులు మూడు స్తంభాలు నాటి ఆలయానికి విద్యుత్ సరఫరా చేశారు. దీంతో కల్లూరు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ నగరి ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వరిపైరుకు తెల్ల తెగుళ్ళు-ఆందోళనలో రైతులు

## -ఓవైపు వర్షాలతో భయం..భయం



తెల్లతెగుళ్ళు సోకిన వరిపైరు దృశ్యం

తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త : తూర్పు మండలాలకు పెట్టింది పేరు వ్యవ'సాయం'. ఇందులో ముఖ్యంగా సుమారు శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తిరూరల్,తొట్టంబేడు, ఏర్పేడు, కెవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల్లో వరిపంట సాగును విస్తారంగా పండిస్తారు. అయితే మరో పదిపదిహేను రోజుల్లో పంట చేతికి వస్తుందనగా ఓవైపు అన్నదాతలకు వర్షం ఎక్కడ పడుతోందో భయం పడుతోంది. మరోవైపు వరిపంటకు తెగుళ్ళు సోకుతున్నాయి. మండలంలో ఈఏడాది ఎక్కువగా 1010 రకం పంట వేశారు. పంటలకు పెట్టుబడులు ఎక్కువవుతున్నాయి. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30వేలుగా ఉంది. శ్రీకాళహస్తిలో 1045 హెక్టార్లు, ఏర్పేడులో 1404, తొట్టంబేడులో 1668 హెక్టార్లు, కెవిబిపురంలో 346 హెక్టార్లు, బుచ్చినాయుడుకండ్రిగలో 253 హెకార్లలో వరిపంట సాగుచేయగా మొత్తం 4716 హెకార్లలో వరిపంటను అన్నదాతలు సాగుచేస్తున్నారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల దృష్ట్యా వరి పంట ప్రస్తుతం వివిధ దశల్లో ఉంది. ముఖ్యంగా వరిపైరుకు తెల్లతెగులు సోకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్బంగా ఎడిఏ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ వరిపైరు ప్రస్తుతం వివిధ దశల్లో ఉందని వరిపంటలో ఆకుముడుత(తెల్లజిల్లేడు) ఆశించి ఉందని ఆలస్యంగా నాటిన పొలాల్లో నత్రజని ఎరువులు ఎక్కువగా వాడిన పొలాల్లో ఇది ఉంటుందన్నారు. పోటుదశలో వస్తే నష్టం ఎక్కువగా ఉంటుందని లార్వాలు రెండు ఆకుల అంచులను కలపి గొట్టంగా చేసి ఆకుపచ్చని పదార్థాన్ని తినడంతో వరిపైరు ఎడిపోతుందన్నారు. ఆకుముడతలను విడదీస్తే లార్వాదశలో ఉన్న లేత పసుపు లేదా ఆకు మచ్చ పురుగులు కనబడడం బట్టి గుర్తించవచ్చన్నారు.

**తీసుకోవాల్సిన చర్యలు..**

వరిపైరుకు తెల్లతెగులు నివారణకు తీసుకోవాల్సి న చర్యలు గురించి శ్రీకాళహస్తి వ్యవసాయ సహాయ సంచాలకులు తెలిపారు. పిలక దశలో చేనుకు అడ్డంగా తాడును 2-3సార్లు లాగితే పురుగులు కిందపడిపోతాయని క్లోరోఫైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా ఎపిఫేట్ 1.5గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పోడుకు దశలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20ఎస్‌సి 0.4 మి.లీ లేదా ఫ్లూ బెండిమైడ్ 48ఎస్‌సి 0.1మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 4 గ్రాములు 8 కిలోలు లేదా క్లోరాండ్రనిలిప్రోల్ 0.4శాతం 4కిలోలు గుళికలు 1 ఎకరాలకు చొప్పన వేయాలన్నారు. అన్నదాతలకు ఎవైనా సందేహాలుంటే వెంటనే మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని లేదా శ్రీకాళహస్తిలోని వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయంలో రైతులు కలసి మెలకువలు తెలుసుకోవచ్చన్నారు.

## ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా నిర్వహణ : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 17 ప్రభాత వార్త: నగరంలోని పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా నిర్వహణ ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని చేపల మార్కెట్, శంకర్ కాలనీ, మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, తిరుమల బైపాస్ రోడ్డులో ప్రకాశం పార్కును ఎహెల్త్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ పార్కుల నిర్వహణ సరిగా లేకపోవడంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేసారు. మరోసారి నిర్వహణ లోపం తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఆహ్లాదం కొరకు పార్కుకు వస్తారని, నగరంలోని పార్కులు శుభ్రంగా ఉండాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగుండాలని అన్నారు. పార్కుల్లో తగినంత సిబ్బంది లేకపోవడం వల్లే నిర్వహణ సరిగా లేదని పలువురు వాకర్లు ఫిర్యాదు చేయడంతో, రిజిస్టర్ పరిశీలించి విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే మధురా నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల బాగా చేపట్టాని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈలు విజయకుమార్ రెడ్డి, శ్రావణి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

## పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై శ్రద్ద చూపండి:ఎస్‌పి



తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై పోలీసులు శ్రద్ద చూపాలని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశించారు. మంగళ వారం పట్టణంలోని అర్బన్, టుటౌన్, రూరల్, తొట్టంబేడు పోలీస్‌స్టేషన్లను తనిఖీచేశారు. ఆయనకు డిఎస్పీ ఉమా మహేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. శివయ్య పుణ్యక్షేత్రంలో శాంతిభద్రతల పరి రక్షణ ఎంతో అవసరమని అందరు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంబందిత పోలీస్‌స్టేషన్లలో కేసుల వివరాలు, పరిష్కరించిన కేసులకు సంబందించి డిఎస్పీని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాళహస్తిలో శాశ్వత భవనాలు లేని పోలీస్‌స్టేషన్లకు త్వరలోనే నిధులు కేటాయించి భవనాలు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని పాత్రికేయులు తెలపడంతో దీనిపై చర్చించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలుతీసుకుంటామన్నారు. పుణ్యక్షేత్రంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనిపై పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి డిఎస్పీతో మాట్లాడారు. ఆయనతో పాటు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, రూరల్ ఎస్ఐ పరమేశ్వర నాయక్, ఇతర సిబ్బందితో పాటు ఇంటిలిజెన్స్ హెడ్‌కానిస్టేబుల్ హరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్‌తో పురుగు మందును స్ప్రేపై అవగాహన



చిల్లకూరు, జులై 17 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలోని బల్లవోలు గ్రామంలో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంను రైతులకు తెలియచేయుటకు వేరుశనక పంటలో డ్రోన్ సహాయంతో పురుగు మందును స్ప్రే చేయు విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా చూపించారు. ఇలా చేయటం వలన పంటలపై పురుగు మందు స్ప్రే చేయుటకు కూలీల కొరతను అధిగమించవచ్చు అని తెలిపారు. సమయం ఆదా అవుతుందని ఒక ఎకరానికి మందు స్ప్రే చెయ్యడానికి ఆరు నిమిషాలు మాత్రమే సరిపోతుంది. మందుల మోతాదును కూడా ఎకరానికి 10 శాతం ఆదా చేయవచ్చు అని రైతుకు ఖర్చు కూడా ఆదా అవుతుందని రైతులకు వివరించారు. ఈ డ్రోన్లను గతంలో శిక్షణ తీసుకున్న రైతులకు రాయితీ మీద అందజేసిన యెడల రాబోవు రోజులలో వ్యవసాయం చెయ్యడం లాభాసాటిగా వుంటుంది. అగ్రికల్చర్ అధికారి, మహిళా రైతు చెరుకూరు పద్మజ కొంతమంది రైతులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో మంత్రి కొల్లు రవీంద్ర



కాణిపాకం, జులై 17 ప్రభాతవార్త: రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, మరియు ఎక్సైజుశాఖ మం త్రి కొల్లు రవీంద్ర సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి కాణిపాకం ఆలయం చేరుకున్న మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం ఉదయం ఆలయంలో స్వామివారి అభిషేకం సేవలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈయనకు వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను,చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. మంత్రి వెంట ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మదుసూదన్‌రావు, ఐరాల మాజీ జడ్పీటీసీ ఎం.లత, ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్సై రామ్మోహన్ స్థానిక నాయకులు నరసింహులు నాయుడు, పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు, మల్లారపల్లె గిరినాయుడు, హేమాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా కాణిపాకం సందర్శనార్థం వచ్చిన మంత్రిని చిత్తూరు మాజీ మేయల్ కఠారి అనూరాధ, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ షణ్ముగంలు మర్యాదపూర్వకంగా కలిశారు.

## సార్లూ... బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టండి

### పదేళ్ల నిరీక్షణకు ఇకనైనా తెరపడుతుందా

పాకాల, జులై 17 ప్రభాతవార్త : పాకాల నుండి మద్ది నాయన పల్లికి వెళ్లే దారిలో సూరినేనిపల్లి, బుల్లయ్యగారిపల్లి మధ్యలో వంక పైన ఉన్న బ్రిడ్జి గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం ఈ మార్గంలో తారు రోడ్డు వేసినప్పటికీ బ్రిడ్జి పై ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించవల్సిందిగా వెంకటాద్రి నాయుడు చేయాలని కోరుతున్నారు.

## కేంద్రమంత్రికి ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూలై 17 ప్రభాతవార్త : తిరుపతి పర్యటనకు విచ్చేసిన కేంద్ర రోడ్లు మరియు రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని తిరుపతి విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎంఎల్‌ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి శ్రీకాళహస్తి కలంకారి కండువాతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్‌కు కేంద్రమంత్రిని సత్కరించారు. ఈసందర్బంగా బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అద్వాన్నంగా ఉన్న రోడ్లుకు నిధులు విడుదల చేయాలని మంత్రిని కోరారు. దీనిపై ఆయన సాను కూలంగా స్పందించారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



పెద్దపంజాణి జూలై 17 ప్రభాతవార్త :దోమలనివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి రామచంద్రా రెడ్డి పేర్కొన్నారు .బుధవారం జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ఆయన మండలంలోని బసవ రాజు కండ్రిగ గ్రామంలో ఆయన పర్యటించారు.ఈ సందర్బంగా స్థానిక సర్పంచ్ రమేష్‌బాబు, రాయలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్ళి జ్వరాలు ఉన్నాయా అని ఆరా తీసారు.గ్రామంలో జ్వరంతో బాదపడుతున్న కొంత మందికి మలేరియా,డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు.పరీక్షల్లో సాధారణన జ్వరంగా తేలింది.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో,పట్టణాల్లో జ్వరాలు వ్యాపిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య చికిత్సలు అందుతున్నాయని అలా కాకుండా ఆర్ఎంపీ,పిఎంపీల వద్దకు వెళ్ళి డబ్బులను వృదా చేసుకోవడంతో పాటు జ్వరాలు తగ్గుముఖం కాకపోగా డెంగ్యూ లక్షణాలు ఉన్నాయంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారిమాటలు నమ్మకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య చికిత్సలు చేసుకోవాలని అవసరమయితే అక్కడే టైఫాయిడ్,మలేరియా,డెంగ్యూ మెదలగు జ్వరాలకు ఉచితంగానే వైద్య పరీక్షలు నిర్వహిచుకోవ్చని తద్వారా నాణ్యమైన వైద్య చికిత్సలు పొందవ్చని సూచించరు.ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి గంగయ్య,ఎంపీహెచ్ఓ శ్రీనివాసులు,ఏఎన్ఎం సుజాత,ఆశావర్కర్ లలిత పాల్గొన్నారు.

## సిఎం సతీమణి భువనేశ్వరికి...

## పులివర్తి ఘన స్వాగతం



చంద్రగిరి, జూలై 17 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ అధినేత నారా భువనేశ్వరికి ఎంఎల్‌ఏ పులివర్తి నాని ఘనస్వాగతం పలికారు. మండల పరిధిలోని కాశిపెంట్ల వద్ద గల హెరిటేజ్‌ని బుధవారం నారా భువనేశ్వరీ సందర్శించారు. ఆమె రాకను తెలుసుకున్న ఎంఎల్‌ఏ ఇక్కడికి చేరుకుని ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాతగం పలికారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మీయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఎంఎల్‌ఏ వెంట టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, నాయకులు శ్రీదర్ నాయుడు, ఎంఆర్‌సి రెడ్డి, తదితరులు వున్నారు.

## ఘనంగా మాధవయ్య జన్మదిన వేడుకలు



పుత్తూరు, జూలై 17 ప్రభాతవార్త : పుత్తూరు మండల మాజీ ఎంపిపి, తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, మండల టిడిపి మాజీ అధ్యక్షుడు చెరుకుల కరుణా యాదవ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో టిడిపి శ్రేణులు హాజరై ఆయనను గజమాలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో భవిష్యత్‌లో మాధవయ్య మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం మాధవయ్య మాట్లాడుతూ గత ఎన్నికల్లో గాలి భానుప్రకాశ్ నాయకత్వంలో నగరి నియోజకవర్గంలో అఖండ మెజార్టీ సాధించామని, రానున్న మునిసిపల్, పంచాయతీ ఎన్నికల్లో కూడా నాయకులు, కార్యకర్తల సహకారంతో పార్టీని విజయపథంలో నడిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎస్.ధనపాల్, తెలుగు యువత రాష్ట్ర మీడియా సమన్వయకర్త డి.జి.ధనపాల్, మాజీ ఎంపిటిసిలు కోట గజపతి, ఆది మండడి, కవిత, ఆదిలక్ష్మి, పరమేశ్వరమంగళం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శేఖర్ నాయుడు, మాజీ సర్పంచ్ వాజ్‌పేయి నాయుడు, మాజీ వైస్ సర్పంచ్ మహేష్, టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు గట్టు శివ, ఇంకా నాయకులు డి.హేమంత్‌కుమార్, సుబ్బు, మోహన్, రమేష్, గంగాకుమార్, గంగయ్య, హరి, మునిలక్ష్మమ్మ, జెసిబి చిన్న, జింకా వెంకటేష్, హరి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సంక్షేమ పథకాలను...ప్రజల్లోకి తీసుకెళ్ళండి

### -బిజెపి నేతలకు కేంద్రమంత్రి భాగల్



తిరుపతిటౌన్,జులై 17ప్రభాతవార్త: కేంద్రంలో మూడవసారి ప్రధానిగామోదీ పాలన చేపట్టిన తరువాత ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వీటిని ప్రజలకు చేరువగా తీసుకెళ్ళాలని కేంద్ర పరిశ్రమశాఖ సహాయమంత్రి ఎస్‌పి సింగ్‌భగేల్ కోరారు. బిజెపి ప్రభుత్వం పలు పథకాలు గత పదిసంవత్సరాలుగా అమలుచేస్తోందన్నారు. ఇవన్నీ ప్రజలకు చేరేలా బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. తిరుమల దర్శనానంతరం తిరుపతికి విచ్చేసిన మంత్రి భగేల్‌కు తిరుపతి జిల్లా బిజెపి నేతలు గుండాల గోపీనాధరెడ్డి, జల్లిమధుసూదన్, జానర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, దీపక్‌యాదవ్, జయంత్‌కుమార్, మల్లారపురవి తదితరులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించారు.



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, అధికారులు

- ప్రభాతవార్త, రేణిగుంట

## వీరభద్రస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు



తొట్టంబేడు, జూలై 17 ప్రభాతవార్త : తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఈశాన్య ప్రాంతమైన చిన్నసింగమాల గ్రామంలో మహిమాన్వితంగా వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో తొలి ఏకాదశిపూజలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆలయంలో వెలసిన వీరభద్రస్వామికి ఉదయం నుంచి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. దీంతో ఆలయం జనసందోహంగా మారింది. ఆలయం ముందు చిన్న నందీశ్వరుడు, లోపలకు వెళ్ళగానే నవగ్రహాలు దర్శనం, పక్కనే నందీశ్వరుడిని దర్శించుకున్నఅనంతరం వీరభద్రస్వామిని దర్శించు కోవచ్చును. అభిషేకానికి అశేష సంఖ్యలో భక్తులు, గ్రామస్తులే కాకుండా పట్టణం నుంచి కూడా పలువురు భక్తులువిచ్చేశారు. అభిషేకాల అనంతరం స్వామివారికి పూలతో విశేషాలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ అలంకరణ ఇట్టే ఆకట్టుకుంది. పలువురు మహిళా భక్తులు మొక్కులుతీర్చుకునేందుకు తడిబట్టలతోనే పొర్లుదండాలతో స్వామివారి ముందు మొకరిళ్ళారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఎంపిపి ఉన్నం నిర్మల, సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, మాజీ కౌన్సిలర్ శెంజిగరం సుప్రజ, వేలు, గ్రామస్తులతో పాటు పలువురు పట్టణ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కన్నయ్య, ఓంకార్‌లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వధూవరుల ఊరేగింపు



శ్రీకాళహస్తి,జూలై 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ద్రౌపదీ సమేత అర్జునుడు వధూవరులుగా పట్టణంలో దర్శనమిచ్చారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద కన్నుల పండువగా అర్జునుడు ద్రౌపదీ వివాహం జరిగింది. ఈ సందర్బంగా ఆలయ ఇఓ ఎన్‌వియన్ఎస్ మూర్తి ఆదేశాలతో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,ఉత్సవాల పర్య వేక్షకుడు లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్ దేవస్థానం అధికారులు, ఉద్యోగస్తులు హాజరయ్యారు. బుధవారం ఉదయం స్వామి అమ్మవార్లు సప ్ర వాహనంలో దర్శనమిచ్చారు. కళ్యాణ ముస్తాబుతోనే అర్జునసమేత ద్రౌపదీ అమ్మవారిని చక్కగా సప్పరంలో ప్రతిష్ఠించారు. ఆలయ సంప్రదాయంతో పూజారులు రఘు, పురుషోత్తంలు స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి ఊరేగింపును ప్రారంభించారు. మధ్యాహ్నం ఆలయంలో రాజసూయయాగం ఘట్టాన్ని భారతంలో చదివి భక్తులకు వినిపించారు. గ్రామోత్సవం ఇన్‌చార్జిగా లక్ష్మయ్యను నియమించారు.

## కుప్పం మున్సిపల్ కమీషనరుగా శ్రీనివాసరావు



కుప్పంరూరల్, జూలై 17 ప్రభాతవార్త : కుప్పం మున్సిపల్ నూతన కమీషనరుగా శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపల్ కమీషనర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఒరిజినల్ పోస్టు అయిన నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ సూపరింటిండెంట్‌గా కొనసాగిస్తూ కుప్పం మున్సిపాలిటీకి ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఎసి) కమీషనరుగా నియమించారు. అలాగే ఇదివరకు కుప్పం మున్సిపల్ కమీషనరు(ఎఫ్ఎసి)గా పనిచేసిన నాగేశ్వరరావును ఆయన ఒరిజినల్ పోస్టు అయిన నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ సూపరింటిండెంట్‌గా నియమించారు. నేడో రేపో నూతన కమీషనరు బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

# గజ దొంగలను పట్టుకున్నపోలీసులు

## భారీ ఎత్తున్న నగదు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

గంగవరం, జూలై 17 ప్రభాతవార్త : గంగవరం పోలీసులు గజ దొంగలను పట్టుకొని వారి వద్ద నుండి రూ.1,71,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పందులు కనిపిస్తే చాలు వెంటనే ఒడిసి పట్టేస్తారు. ఆపై గంటల వ్యధిలోనే కేజీల లెక్కన మాంసం విక్రయం వారి నైజం.ఇదీ అనంతపురం జిల్లాకు చెందిన గజ పందుల దొంగల ముఠా వ్యవహారాన్ని గంగవరం పోలీసులు గుట్టు రట్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో పలమనేరు ఇంచార్జి డిఎస్పీ రఘువీర్ విష్ణు కథనం మేరకు వివరాలిలా..గత రెండు నెలలుగా గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో సుమారు 100కు పైగా పందులు చోరీకి గురికావడంతో దీనిపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాలతో ఇంచార్జి డిఎస్పీ రఘువీర్ విష్ణు సూచనల మేరకు గంగవరం అర్బన్ సిఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో ఐడి పార్టీ సబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తుండగా ఈ నెల 16న మదనపల్లె పరిసర ప్రాంతాల్లో చోరీ చేసిన నిందితు,పందులపై సమాచారం రావడంతో అందిన సమాచారం మేరకు నిందితుల కోసం గాలిస్తుండగా మదనపల్లె మండలం నిమ్మనపల్లె క్రాస్ వద్ద అనంతపురం జిల్లాకు రాప్తాడు మండలం చిన్మయినగర్‌కు ఎరికుల చంద్రశేఖర్(30), దేరంగుల విజయ్(20),ఎరుకుల వాసు(25), బెస్తరాఖేష్ (22), శెట్టి సురేంద్ర(21)లను అదుపులోనికి తీసుకొని విచారించగా అనంతపురం జిల్లాలో పందులను చోరీ చేయడంలో రాటుదేలిన నిందితులని అదే క్రమంలో గంగవరం మండలం బెస్తగానిపల్లె వద్ద 47 పందులను, అరసనపల్లె వద్ద 35 పందులను,పెద్దపంజాణి మండలం రాజుపల్లె వద్ద ప్రాంతాల్లో చోరీ చేసిన పందులను ముక్కలుగా చేసి మదనపల్లె పరిసర ప్రాంతాల్లో కిలో రూ.190 వంతు విక్రయించి సొమ్ము చేసుకొనేవారని ఆయన తెలిపారు.వీరి వద్ద నుండి సూమారు రూ.9.3 లక్షలు విలువ చేసే చోరీకి గురైన 112 పందులను,ఒక లగేజ్ వాహనంను,ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు శ్రీనివాసులు,అశ్వర్థనారాయణ, మనోహర్, రైటర్ నాగరాజు, సిబ్బంది గిరి, శశి, నవీన్, రమేష్, చిన్ని, అలీ తదితరులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ దొంగలను పట్టుకున్న పోలీసులు



నిందితులను అరెస్టుచేసి చూపుతున్న పోలీసులు

పాకాల, జులై 17 ప్రభాతవార్త : పాకాల మండలం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తిరుపతి డిఎస్పి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి డిఎస్పి నరసింగప్ప మాట్లాడుతూ గత నెల 16వ తేదీన నేంద్రగుంట వద్ద ఒంటరిగా ఉన్న మహిళ మెడలో కొంతమంది వ్యక్తులు బంగారు తాళిబొట్టును లాక్కొని వెళ్లారని, అక్కడే ఉన్న కొంత మంది ప్రజలు వారిని వెంటపడడంతో దొంగలు వాళ్ల దగ్గర ఉన్నటువంటి బైక్‌లను అక్కడే వదిలేసి వెళ్ళిపోయారన్నారు. ఈ కేసును ఎలాగైనా పట్టాలని వివిధ కోణాల్లో ఆలోచన చేస్తున్నటువంటి క్రమంలో మంగళవారం సాయంకాలం నాలుగు గంటలకు నేంద్రగుంట హైవే ఫ్లైఓవర్ కింద వాహనాలను తనిఖీలు చేస్తుండగా రెండు మోటార్ సైకిల్‌లో నలుగురు వ్యక్తులు పోలీస్ వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా వాళ్లని పోలీసులు పట్టుకొని విచారిస్తే వాళ్లు గతంలో చేసినటువంటి నేరాలు అంటే గత నెలలో 16వ తేదిన నేంద్రగుంటలో మహిళా మెడలో లాక్కొని వెళ్ళినటువంటి బంగారు తాళిబొట్టు, పెనుమూరు, పూతలపట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోను ఇదే విధంగా చేసినటువంటి దొంగతనాలు తర్వాత తవణంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే విధంగా పగలే దొంగతనం చేసినటువంటి దొంగతనాలు తర్వాత తవణంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే విధంగా పగలే దొంగతనం చేసినటువంటి వివిధ రకాల చిన్నచిన్న ఆభరణాలు వీరిని అరెస్టు చేసి విరి వద్ద నుంచి సమారు 87 గ్రాములు బంగారం అంటే సుమారు ఐదు లక్షల విలువ చేసే వివిధ బంగారు ఆభరణాలు వారు దొంగతనానికి ఉపయోగించినటువంటి మూడు మోటార్ సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పి తెలిపారు. ఈ దొంగతనం చేసినటువంటి ముద్దాయిలు మొదట వ్యక్తి మురళి, ఇతను ఊరు వావిళ్ళతోట ఇతని సోదరుడు బాబు, ఇతను ఇతని సోదరుడు వీళ్లది గతంలో కూడా నేర చరిత్ర ఉందని వీళ్లపై తిరుపతి సిసిఎస్‌లో కేసులు కూడా ఉన్నాయన్నారు. బాబు అనే వ్యక్తి చిన్న పిల్లల కోర్టులో కూడా బాలనేరస్తుల కోర్టులో కూడా కేసులు విచారించడం జరిగిందన్నారు. తర్వాత హర్షవర్ధన్ రాజు ఇతనిది మఠంపల్లి, పెనుమూరు మండలం వరుణ్ కుమార్, భాస్కరపురం, పెనుమూరు మండలం ఈ నలుగురు కూడా చిన్న చిన్న దొంగతనాలు, ఒంటరిగా పోతున్నటువంటి మహిళల మెడలో చైన్లు లాకుపోవడం అటువంటి నేరాలను చేస్తున్నారన్నారు. అటువంటి వారిని పట్టుకొని బంగారు ఆభరణలు, మూడు మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో కీలకపాత్ర పోషించినటువంటి సిఐ శ్రీరాములు, ఎస్ఐలు మహేష్ బాబు, లోకేష్, సిబ్బందిని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు అభినందించారు.